క్లుప్తంగా

బాలచెరువులో శని త్రయోదశి పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

పెదగంట్యాడ: శనిదోష నివారణకు బాలచెరువు ఉమారామాలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని (శనైశ్చర) స్వామివారిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. స్వామికి ప్రీతికరమైన శనివారంతో పాటు శని త్రయోదశి పర్వదినం కలసి రావడంతో భక్తులు తరలివచ్చి స్వామివారికి తెల్లవారుజాము నుంచి ఆలయ అర్చకుడు వాసుదేవశర్మ ఆధ్వర్యంలో తైలాభిషేకాలు, అర్చనలు, హారతి నిర్వహించారు.భక్తులు శనైశ్వరుడికి నల్ల వస్త్రం, నువ్వులతో ప్రత్యేక పూజలు చేశారు.

నేడు ఉక్కునగరంలో మే డే మార్చ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఆదివారం మే డే మార్చ్ నిర్వహించనున్నామని జీవీఎంసీ 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహించనున్న మార్చ్ ఆ రోజు ఉదయం 6.30 గంటలకు సెక్టార్–5 త్రిష్ణా మైదానం నుంచి ప్రారంభమవుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని వివిధ సెక్టార్ల మీదుగా 5 కిలో మీటర్లు నిర్వహించనున్న మార్చ్‌లో ఉక్కు ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, మహిళలు, విద్యార్థులు పాల్గోవాలని ఆయన కోరారు.

పేద పిల్లలకు రేషన్ పంపిణీ



తుంగ్లాంలో రేషన్ అందజేస్తున్న సుధీర్ రెడ్డి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంకు చెందిన ఎన్ఆర్ఐ గొందేసి సుధీర్ రెడ్డి పేద పిల్లలకు రూ.50 వేల విలువ చేసే రేషన్ సరకులు అందజేశారు. శనివారం తన తండ్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు గొందేసి రామిరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని నెలకు సరిపడా రేషన్‌ను పేద పిల్లలకు అందజేసినట్లు తెలిపారు.

గాజువాక రూరల్ మండలం ఏర్పాటు చేయాలని వినతి

అగనంపూడి: అగనంపూడి, దువ్వాడ, ఫార్మా సిటీ కాలనీలతో కలిపి గాజువాక రూరల్ మండలం ఏర్పాటు చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డోలా బాల వీరాంజనేయస్వామిని అగనంపూడికి చెందిన నాయకులు కోరారు. విశాఖ డీఆర్‌సీ సమావేశంలో పాల్గొడానికి విచ్చేసిన ఆయన్ను కలిసి వినతి పత్రం అందించారు. అలాగే అగనంపూడిలో రైతు బజార్, క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని, హోమీబాబా క్యాన్సర్‌ఆస్పత్రిలో స్థానికులకు ఉపాధి కల్పించాలని విన్నవించారు. అగనంపూడి వంతెన కింది నుంచి ఫార్మాసిటీకి ప్రత్యామ్నాయ రహదారి నిర్మించాలని.. తలారివారిపాలెం అండర్‌పాత్‌వే స్థానంలో ఫ్లైఓవర్ నిర్మించాలని కోరారు. నాయకులు ఇల్లపు ప్రసాద్, కర్రి దేంద్ర, బలిరెడ్డి సత్యనారాయణ, కసిపల్లి శ్రీనివాసరావు, కొరాయి జగదీష్ పాల్గొన్నారు.

'ఉర్సా'కి కేటాయించిన భూములు రద్దు చేయాలి

దాబాగార్డెన్స్: విశాఖలో 250 కోట్ల విలువ కలిగిన 60 ఎకరాల భూమిని ఉర్సా ఐటీ కంపెనీకి ధారాదత్తం చేయడాన్ని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె. లోకనాథం తీవ్రంగా ఖండించారు. ఇది బోగస్ కంపెనీ అని తక్షణమే కేటాయించిన ఈ భూమిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడితో కలిసి మాట్లాడారు. ఐటీ ఉద్యోగాల కల్పన పేరిట విశాఖలో అత్యంత విలువైన కొండల్ని, ప్రభుత్వ భూములను ప్రైవేట్ ఐటీ సంస్థలకు కూటమి ప్రభుత్వం కట్టబెడుతుందన్నారు. గత 15 ఏళ్లుగా ఐటీ ఉద్యోగాలు కల్పిస్తామని ఆశలు చూపించి భూములు కాజేస్తున్నారన్నారు. విశాఖపట్నం హిల్ నంబర్–3లో మూడున్నర ఎకరాలు, కాపులుప్పాడలో యాభైన్నర ఎకరాల భూమిని ఐటీ కంపెనీలకు కేటాయించిందన్నారు. ఉద్యోగాలు కల్పించని కంపెనీలకు, రిజిస్ట్రేషన్ లేని కంపెనీలకు, రెండు నెలల కిందటే రిజిస్ట్రేషన్ అయిన ఉర్సా కంపెనీకి కారు చౌకగా భూములు ధారాదత్తం చేయడమంటే భూములు కాజేయడమేనన్నారు. ఈ ప్రాంతంలో ఎకరా రూ.4 కోట్ల విలువ ఉందని, సుమారు 250 కోట్ల వరకు ప్రజల ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. రుషికొండ భూములను టీసీఎస్‌కు ఎకరం 99 పైసలకే కట్టబెట్టిందని, కోట్ల రూపాయల విలువ కలిగిన భూములు కారుచౌకగా ఎందుకు కట్టబెడుతున్నారని ప్రశ్నించారు.

సీఐఎస్ఎఫ్ యూనిట్ ఉంటుందా..!

స్టీల్‌ప్లాంట్‌లో సేవలు ముగుస్తాయని ప్రచారం

- బలం చేకూర్చుతున్న తాజా పరిణామాలు
- ఇప్పటికే సిబ్బంది కుదింపు
- 283 మందికి తగ్గించాలని ఉక్కు యాజమాన్యం సూచన
- సమన్వయం కష్టమని నివేదించిన సీఐఎస్ఎఫ్ డీఐజీ!
- రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్‌ఫోర్స్ ఏర్పాటుకు రంగం సిద్ధం
- ఇప్పటికే భద్రత విధుల్లో హోంగార్డులు



విశాఖ
స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం ఏర్పాటు చేసిన కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) యూనిట్ కొనసాగింపుపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రైవేటీకరణ అంశం తెరపైకి వచ్చిన తర్వాత ఇప్పటికే కొంతమంది సిబ్బందిని తగ్గించారు. తాజాగా మరికొంత మంది సిబ్బందిని తగ్గించడానికి జరుగుతున్న ప్రయత్నాలు ఇందుకు బలం చేకూర్చుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉండే స్పెషల్ ఫోర్సును ఏర్పాటు చేయనుండడంతో సీఐఎస్ఎఫ్ ఉన్నతాధికారులు కూడా అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోంది. సిబ్బంది కుదింపుకంటే యూనిట్‌ను రద్దు చేయడమే మేలని ప్రతిపాదించినట్టు విశ్వసనీయ సమాచారం.
- ఉక్కునగరం

రాష్ట్రంలోనే అతి పెద్ద పారిశ్రామిక సంస్థ విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం స్టీల్‌ప్లాంట్‌లో సీఐఎస్ఎఫ్ యూనిట్ ఏర్పాటు చేశారు. ప్లాంట్ లోకి అనుమతి లేని వ్యక్తులు ప్రవేశించకుండా తనిఖీలతో పాటు దొంగతనాలు జరగకుండా చూడడం వారి ప్రధాన బాధ్యత. అదే విధంగా స్టీల్‌ప్లాంట్‌లోని విభాగాల్లో జరిగే అగ్ని ప్రమాదాలు, యంత్రాల రక్షణ సీఐఎస్ఎఫ్ ఫైర్ వింగ్ చూస్తుంది. నేరాల నియంత్రణకు క్రైం అండ్ ఇంటిలిజెన్స్ వింగ్ కూడా ప్రత్యేకంగా కొనసాగుతుంది.

జనవరిలో సగం సిబ్బంది తగ్గింపు

యూనిట్ ఏర్పాటులో అనుమతి మేరకు 1100 మంది సిబ్బందిని నియమించాల్సి ఉంది. అయితే ప్రారంభం నుంచి 850 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వీరికి జీతభత్యాలు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యమే చెల్లిస్తోంది. స్టీల్‌ప్లాంట్ ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లిన తర్వాత కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ వివిధ చర్యలు ప్రారంభించింది. ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల తగ్గింపుతో పాటు సీఐఎస్ఎఫ్ సిబ్బంది తగ్గింపును తెరపైకి తెచ్చారు. ఇందులో భాగంగా సిబ్బందిని 430కి తగ్గించాలని ప్రతిపాదించారు. ఒకేసారి సగం మందిని తగ్గిస్తే కష్టం అని సీఐఎస్ఎఫ్ ఉన్నతాధికారులు యాజమాన్యం వద్ద ప్రతిపాదించారు. అయితే వారికి ప్రత్యామ్నాయంగా కొంత కాలం హోంగార్డులను నియమిస్తామని చెప్పడంతో ఈ ఏడాది జనవరిలో అయిష్టంగానే సిబ్బందిని 430కి తగ్గించారు.

స్పెషల్ ఫోర్స్ ఏర్పాటుకు అంగీకారం

ఇదిలా ఉండగా ఉక్కు మంత్రిత్వశాఖ అధికారులు ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తెచ్చి వారి సిబ్బందిని నియమించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ ఫోర్స్‌ను ఇవ్వడానికి అంగీకరించింది. మొదట 160 మందిని ఇస్తామని తెలిపారు. ఈలోగా కొంత మంది హోంగార్డులను తీసుకుని, వారిని సబ్ స్టోర్స్ వంటి ప్రాంతాల్లో విధుల్లో పెట్టినట్టు తెలుస్తోంది.

ఇంకా తగ్గించాలని ఒత్తిడి

ఇదిలా ఉండగా ఉన్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది 430 మందిని 283 మందికి తగ్గించాలని ఉక్కు యాజమాన్యం సీఐఎస్ఎఫ్ ఉన్నతాధికారులకు తెలియజేశారు. ఇప్పటికే అసంతృప్తిగా ఉన్న సీఐఎస్ఎఫ్ ఉన్నతాధికారులు తమ డీఐజీకి సమస్యను నివేదించారు. సీఐఎస్ఎఫ్ కేంద్ర కార్యాలయానికి తక్కువ సిబ్బందితో యూనిట్ నడపడంతో జరిగే పరిణామాలను డీఐజీ వివరించారు. మరీ తక్కువ సిబ్బందితో నడిపే కన్నా యూనిట్ మూసివేత మంచిదన్న ప్రతిపాదన పంపినట్టు తెలిసింది. దీనికి సీఐఎస్ఎఫ్ ఉన్నత యాజమాన్యం కూడా సానుకూలంగా స్పందించినట్టు ప్రచారం సాగుతోంది. సీఐఎస్ఎఫ్, రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ ఫోర్స్‌లు రెండు ఆర్మ్‌డ్ ఫోర్స్ అయినప్పటికీ పరస్పరం సమన్వయంలో వచ్చే పరిణామాలను దృష్టిలో ఉంచుకుని సీఐఎస్ఎఫ్ ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సిబ్బందితో ఉండే సీఐఎస్ఎఫ్ యూనిట్‌లోని సిబ్బందిని ప్రతీ మూడేళ్లకు ఒకసారి బదిలీ చేస్తుంటారు. వారు బదిలీ ప్రాంతంలో సెటిల్ అయ్యే వ్యవధిలో మరో ప్రాంతానికి బదిలీ అవుతుంటారు. అదే రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన స్థానిక సిబ్బంది వల్ల ప్లాంట్ ఆస్తుల రక్షణకు లాభమా, నష్టమా అని ఆలోచించాల్సి ఉంది. మరో వైపు ఈ పరిణామాలు దేనికి సంకేతమని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కోర్టుల సముదాయంలో వసతులపై ఆరా



గాజువాక న్యాయమూర్తులు, న్యాయవాదులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి చెన్నంశెట్టి రాజు

గాజువాక: విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి చెన్నంశెట్టి రాజు శనివారం గాజువాక కోర్టు సముదాయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కోర్టు భవనాల స్థితిగతులను పరిశీలించారు. ఇక్కడి సమస్యలను పరిష్కరించడంతోపాటు సౌకర్యాలు కల్పించాలని కోరుతూ గాజువాక న్యాయవాదుల సంఘం ప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు. అవసరమైన అదనపు సౌకర్యాల కోసం ఆర్ అండ్ బీ అధికారులకు నివేదిక పంపించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు జి.షణ్ముఖరావు, కె.కవిత, ఎం.బి.శేషమ్మ, యార్లగడ్డ శ్రీలక్ష్మి, వి పల్లవి, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు యశోధర వేదమణి, డి.చిరంజీవి, ఆర్ అండ్ బీ అధికారులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

పెదగంట్యాడ: వేసవి సెలవులు ప్రారంభం కావడంతో పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరానికి శనివారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి పీవీ రమణ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించామని తెలిపారు. జూన్ 6 వరకూ ఈ శిబిరం నిర్వహించనున్నామని చెప్పారు. ఇందులో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. అలాగే విద్యార్థులతో పుస్తకాలు చదివించడం, కథలు వినిపించడం, విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని నింపేందుకు ఆటల పోటీలు నిర్వహిస్తామని వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు శిబిరంలో పాల్గొనాలని కోరారు.

పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు సత్కారం



నరసింగరావు మాస్టార్, ఉక్కు ఉద్యోగి రమణ మూర్తి దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి శాంతినగర్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ప్రధాన సలహాదారు నరసింగరావు మాస్టార్, కమిటీ ప్రతినిధి, ఉక్కు ఉద్యోగి నక్కా రమమూర్తి దంపతులను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. కమిటీలో కీలకంగా వ్యవహరిస్తున్న వీరివురూ వారి వారి ఉద్యోగాల్లో పదవీ విరమణ పొందడంతో శనివారం సన్మానించారు. ఆలయ ధర్మకర్త ఈకే చారి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ ఆలయ ఆధ్వర్యంలో చేపట్టే ప్రతీ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటామని చెప్పారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు సాయిబు నాయుడు, కృష్ణారావు, సోమశేఖర్, సత్యనారాయణ, గుర్నాథరావు, మేడిశెట్టి ఉమామహేశ్వరరావు, నాగలక్ష్మి పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ గణపతి ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ గుడివాడ అనూష, లతీష్ దంపతులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలోని పంచవటిలోని లక్ష్మీ గణపతి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం జరిగిన కార్యక్రమంలో ఆలయంలో వేకువజాము నుంచే గణపతికి విశేష పూజలతో పాటు లక్ష్మీ హోమం నిర్వహించారు. పూజల్లో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్ గణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ మురళీ కృష్ణ, పంచవటి హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పోవా) అధ్యక్షుడు పి.చిన్నారావు, పోవా ప్రధానకార్యదర్శి వై.రామ్మోహన్, ఉపాధ్యక్షుడు ఎస్.పండా, కోశాధికారి ఎన్.మానస, సంయుక్త కార్యదర్శి కె.శ్రీనివాసరావు, సంద్రాన నూకరాజు పాల్గొన్నారు.

బాక్స్ క్రికెట్ మైదానం ప్రారంభం

పంచవటిలో నూతనంగా ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్ మైదానాన్ని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ గుడివాడ అనూష, లతీష్‌లు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవిలో ఆటవిడుపుకోసం ఇలాంటి మైదానం సౌకర్యంగా ఉంటుందన్నారు.

దివ్యాంగులకు సంక్షేమ పథకాలు పక్కాగా అమలు చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

బీచ్‌రోడ్డు: విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించిన కలెక్టర్, దివ్యాంగుల పథకాల అమలు ప్రతి శాఖలో నోడల్ అధికారి పర్యవేక్షణలో జరగాలని సూచించారు. దివ్యాంగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా వైద్య సిబ్బందితో సమావేశాలు నిర్వహించాలని, వారి హక్కులు, చట్టాలు కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. దివ్యాంగుల పిల్లలకు విద్య అందేలా చర్యలు తీసుకోవాలని, వారు అన్ని ప్రదేశాలను సందర్శించేందుకు వీలుగా ర్యాంపులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ మాధవితో పాటు అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వయోవృద్ధుల పోషణ, సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు డివిజనల్, మండల స్థాయిలో ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా సీనియర్ సిటిజన్స్ కమిటీ మీటింగ్‌లో కలెక్టర్ మాట్లాడారు.

ముగిసిన చందనం అరగదీత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో తొలివిడత చందనం అరగదీత శనివారంతో పూర్తయింది. ఈనెల 30న చందనోత్సవాన్ని పురస్కరించుకుని స్వామికి సమర్పించాల్సిన మూడు మణుగుల(సుమారు 125 కిలోలు) పచ్చి చందనాన్ని సమకూర్చేందుకు ఈనెల 24వ తేదీ నుంచి అరగదీతను ప్రారంభించిన విషయం తెలిసిందే. కాగా మూడు రోజుల్లోనే అరగదీతను సిబ్బంది పూర్తిచేశారు. కావాల్సిన సుమారు 125 కిలోల పచ్చి చందనాన్ని సిద్ధం చేశారు.

నడుపూరు పాఠశాలకు ప్రశంసలు

'ఎక్స్'లో విద్యాశాఖమంత్రి లోకేష్

పెదగంట్యాడ: నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 49 మంది విద్యార్థులు పదోతరగతిలో 500కు పైగా మార్కులు సాధించడంతో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఉపాధ్యాయులు ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించడంతో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ స్పందించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందిస్తూ ఇన్‌స్టా గ్రామ్, ఎక్స్‌లో ట్వీట్ చేశారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సాధించిన అద్భుత విజయానికి అభినందనలు.. విద్యార్థులు సాధించిన మార్కులను ప్రదర్శించి ర్యాలీ నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. తల్లిదండ్రులను ఆకర్షించేందుకు ప్రైవేటు విద్యా సంస్థలు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తాయని పేర్కొన్నారు. మొట్టమొదటి సారిగా ప్రభుత్వ పాఠశాలలో గుణాత్మక విద్యను అందిస్తామని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేయడం గొప్ప విషయమన్నారు. అద్భుత ఫలితాలు సాధించేందుక అవిశ్రాంతంగా అంకితభావంతో పని చేసిన ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల ప్రతిభకు పట్టం కట్టేందుకు.. వారిలో మరింత ఉత్సాహం నింపేందుకు ఈ ర్యాలీ ఎంతో దోహదం చేస్తుందని, అలాగే తల్లిదండ్రుల్లో కూడా ఆలోచనలను రేకెత్తిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం రాచకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీపై రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ స్పందిచడం సంతోషించదగ్గ విషయమన్నారు. జిల్లా విద్యా శాఖాధికారి ప్రేమ్‌కుమార్ కూడా స్పందించి అభినందనలు తెలియజేశారని వివరించారు. అలాగే పాఠశాల విద్య ఆర్జేడీ విజయ్ భాస్కర్ కూడా విద్యార్థులను, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను అభినందించారన్నారు.

బీమా పరిహారం జాప్యంపై రాష్ట్రపతికి ఫిర్యాదు

అగనంపూడి: ఉక్కు కార్మికుల జీతాల నుంచి కోత విధించి బీమా సంస్థలకు ఉక్కు యాజమాన్యం సకాలంలో జమలు చేయకపోవడంతో వివిధ దుర్ఘటనల్లో మృతిచెందిన కార్మికుల వారసులకు బీమా సంస్థలు నగదు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్నాయని సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు ఆరోపించారు. అగనంపూడిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యాజమాన్యం కార్మికుల పేరున గ్రూప్ పర్సనల్ ఇన్సూరెన్స్ కోసం జీతాల నుంచి కోత విధించిన మొత్తాన్ని బీమా సంస్థ పేరుతో జమ చేస్తుందన్నారు. కొన్ని సందర్భాల్లో కార్మికుల ప్రీమియం యాజమాన్యం సరిగా చెల్లించక పోవడం, బీమా సంస్థ అడిగిన వివరాలు సకాలంలో అందించకపోవడంతో మృతులపై ఆధారపడ్డ కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాయన్నారు. ఇన్సూరెన్స్ కంపెనీల చుట్టూ తిరుగుతున్నా స్పందించకపోవడంతో బాధితులు గొడ్డి నాగమ్మ, సీతిన లక్ష్మిలు బీమా కంపెనీని స.హ.చ. ద్వారా సమాచారం కోరితే సమాచారానికి డబ్బులు చెల్లించాలని తిప్పి పంపించడం సమాచర హక్కు చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నారు. ఈ విషయంపై రాష్ట్రపతి, కేంద్ర సమాచార హక్కు కమిషన్‌కు ఫిర్యాదు చేశామని సమాచార హక్కు చట్టం కార్యకర్త రామ అప్పారావు తెలిపారు.


ఆర్చరీ పోటీల విజేత ఒడిశా



ఆర్చరీ పోటీలు ప్రారంభిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డి.వి.జి శంకర్రావు

కొమ్మాది: బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా దేశ వ్యాప్తంగా జరుగుతున్న జన జాతీయ గౌరవ్ వర్ష కార్యక్రమంలో భాగంగా జన జాతీయ ఖేల్ మహోత్సవ్–ట్రైబల్ అర్చరీ మీట్ శనివారం గీతం కళాశాల ప్రాంగణంలో ఘనంగా ముగిశాయి. రెండో రోజు ఆర్చరీ మీట్‌ను రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డి.వి.జి శంకర్రావు పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన టీసీఆర్‌టీఎం బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆర్చరీ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, ఒడిశా, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్తాన్, తెలంగాణ, అండమాన్ నికోబార్‌లతో పాటు రాష్ట్రంలోని 8 ఐటీడీఏల నుంచి సీనియర్, జూనియర్ స్థాయిలో గిరిజన క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో ఒడిశాఖ మొదటి స్థానాన్ని కైవసం చేసుకోగా, రెండో స్థానాన్ని తెలంగాణ రాష్ట్రం కైవసం చేసుకుంది. విజేతలకు టీసీఆర్‌టీఎం ఈడీ రాణిమందా సర్టిఫికెట్లను, బహుమతులు అందజేశారు.

పోప్ ఫ్రాన్సిస్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న విశ్రాంత అగ్రపీఠాధిపతి డాక్టర్ మల్లవరపు ప్రకాష్

దాబాగార్డెన్స్: మహారాణిపేటలో గల విశాఖ అగ్రపీఠం కార్యాలయంలో శనివారం విశ్వ శ్రీసభ సంఘ కాపరి పోప్ ఫ్రాన్సిస్‌కు ఘన నివాళి కార్యక్రమం నిర్వహించారు. విశ్రాంత అగ్రపీఠాధిపతి డాక్టర్ మల్లవరపు ప్రకాష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ యావత్ క్రైస్తవ లోకానికి మార్గ చూపరి పోప్ ఫ్రాన్సిస్‌గా పేర్కొన్నారు. యావత్ ప్రపంచానికి దేవుని సేవకుడు అయిన పోప్ ఫ్రాన్సిస్ మరణ వార్త విషాదం నింపిందన్నారు. విశ్వవ్యాప్తంగా ఆయన ఎన్నో సేవలందించారని, దేవుని సేవకుడిగా, దైవ వారసుడిగా ఆయన సువార్త సేవలు అమోఘమని కొనియాడారు. 88 ఏళ్ల వయస్సులో కూడా దైవ సేవ చేస్తూ, దైవ సన్నిధానానికి చేరిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. 11 ఏళ్ల పోప్‌గా శాంతి సందేశాలు అందించారని చెప్పారు. అనంతరం పునీత ఆంథోనీ చర్చిలో ప్రత్యేక దివ్య బలిపూజను పదుల సంఖ్యలో నిర్వహించారు. కార్యక్రమంలో ఫాదర్లు జొన్నాడ జాన్ ప్రకాష్, దుగ్గంపూడి బాలశౌరి, జయరాజు, రత్నకుమార్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు సత్కారం



అగనంపూడి, పినమడక హైస్కూళ్లలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరిస్తున్న నాయకులు

అగనంపూడి: కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాణించడం సంతోషంగా ఉందని ఏపీ ప్రజా రవాణా సంస్థ డిప్యూటీ సూపరింటెండెంట్ ఉప్పలపాటి లక్ష్మి అన్నారు. అగనంపూడి సీడబ్ల్యూసీలో ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అగనంపూడి, పినమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభకనబర్చి పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఉత్తమ బోధన సాగిస్తున్నారని, భవిష్యత్‌లో రాణించి లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ప్రేరణ అసోసియేషన్ ఫర్ సోషల్ సర్వీసెస్ కార్యదర్శి బాలబొమ్మల శ్రీనివాసరావు మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు సంస్థ ద్వారా ఉచిత కంప్యూటర్ శిక్షణ, స్పోకెన్ ఇంగ్లిష్, టైప్ రైటింగ్‌ల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, కిడిమి హనుమంతురావు, కేజేనాయుడు, అగనంపూడి బ్రహ్మకుమారీస్ సంస్థ దివ్య జ్యోతి భవనం ఇన్‌చార్జి బీకే రామకోటి, మహాత్మాగాంధీ సేవా సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు



త్రిష్ణా మైదానంలో పోటీలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ గంగారావు



పోటీల్లో పాల్గొన్న బాలలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని త్రిష్ణా మైదానంలో శనివారం జీవీఎంసీ 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు, స్టీల్ సీఐటీయూ, ఐద్వా ఉక్కునగరం కమిటీల ఆధ్వర్యంలో స్థానిక క్రీడాపోటీలు నిర్వహించారు. స్లో సైక్లింగ్, 100 మీటర్ల పరుగు పోటీలు, ఇన్–అవుట్ గేమ్, సెవెన్స్ స్టెప్స్, బెలూన్ బ్లోయింగ్ అండ్ బ్లాస్టింగ్ పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పురుషులకు, స్త్రీలకు కిలోమీటరు నడక, ఇన్ అవుట్ గేమ్, సెవెన్ స్టెప్స్, ప్లేట్ అండ్ బ్యాంగిల్స్, స్ట్రా- థర్మోకోల్ బాల్, బకెట్ అండ్ బాల్‌త్రో, పజిల్స్, థ్రెడ్ అండ్ నీడిల్, స్లో సైక్లింగ్ పోటీలు జరిగాయి. వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ నిర్వీర్యానికి అడుగులు వేస్తుంటే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం దానికి మడుగులు ఒత్తుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రధానకార్యదర్శి యు. రామస్వామి, ఎస్.కె. మొహిద్దిన్, ఆర్. వెంకటరావు, ప్రదీప్, శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, మహేష్, ఐద్వా నాయకులు వేణు, ప్రభ తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల సమయంలో రెస్క్యూపై మాక్ డ్రిల్



రసాయన ప్రమాదాలు సంభవించినప్పుడు జాగ్రత్తలను వివరిస్తున్న అగ్నిమాపకదళం



క్షతగాత్రులను స్ట్రెచర్‌పై అంబులెన్స్‌లోకి తరలిస్తున్న సిబ్బంది

అగనంపూడి: పరిశ్రమల్లో అనుకోని పరిస్థితుల్లో అగ్ని ప్రమాదాలు, రసాయన ప్రమాదాలు, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై దువ్వాడ వీఎస్ఈజెడ్ ఆవరణలోని సినర్జీస్ క్యాస్టింగ్స్ లిమిటెడ్ సంస్థ మాక్ డ్రిల్ నిర్వహించి సిబ్బందికి అవగాహన కల్పించింది. ప్రమాదాల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా ఎటువంటి చర్యలు తీసుకోవాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎలా అప్రమత్తం చేయాలనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సినర్జీస్ సంస్థ డీజీఎం భాగ్యరత్నం మాట్లాడుతూ వేసవిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్, అగ్నిప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తుంటాయన్నారు. ఇలాంటి సమయంలో చేయాల్సిన రెస్క్యూపై సిబ్బందిని అప్రమత్తం చేయడానికి ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ ఫణీంద్ర, ఎల్లాజీరావు పాల్గొన్నారు.